పాలకొల్లులో తాగునీటి సమస్యకు చెక్

- వారం రోజుల్లో నూతన ఫిల్టర్ ప్లాంట్, ఓహెచ్ఆర్ ట్యాంకుల ప్రారంభం
- రోజుకు రెండు కోట్ల లీటర్లు విడుదల


త్వరలో ప్రారంభం కానున్న నూతన వాటర్ ఫిల్టర్ ప్లాంట్


బెత్లహంపేటలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఓహెచ్ఆర్ ట్యాంక్

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని శివారు ప్రాంతాలకు తాగునీటి సమస్య ఎక్కువగానే ఉంది. వేసవికాలం వచ్చిందంటే చాలు ఈ సమస్య మరింత తీవ్రరూపం దాలుస్తుంది. పట్టణంలో రెండు ఎస్.ఎస్ (సమ్మర్ స్టోరేజ్) ట్యాంకులు, మూడు ఓహెచ్ఆర్ (ఓవర్ హెడ్ రిజర్వాయర్లు) ట్యాంకులు ఉన్నాయి. పట్టణంలో యడ్లబజారు సెంటర్, బీఆర్ఎంవీ మునిసిపల్ హైస్కూల్, వాటర్ వర్క్సులోను ఓహెచ్ఆర్ ట్యాంకులు ఉన్నాయి. పట్టణంలో శివారు ప్రాంతాలైన బెత్లహంపేట, హౌసింగ్‌బోర్డు కాలనీ, న్యూ బ్యాంక్ కాలనీ, చినగోపురం ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. వేసవి కాలంలో అయితే ఈ సమస్య మరింత జఠిలం అవుతుంది. సమస్యను పరిష్కరించాలనే దిశగా ప్రస్తుతం పబ్లిక్ హెల్త్ నిధులు మొత్తం రూ.15 కోట్లతో నూతన ఫిల్టర్ ప్లాంట్ మరియు హౌసింగ్ బోర్డు కాలనీ, బెత్లహంపేట ప్రాంతాల్లో మరో రెండు ఓహెచ్ఆర్ ట్యాంకులను నిర్మాణం చేశారు. వీటి వల్ల శివారు ప్రాంతాలకు తాగునీటి సమస్య తీరడమే కాకుండా పాత మూడు ఓహెచ్ఆర్‌లపై ఒత్తిడి తగ్గుతుండడంతో వాటి నుంచి సరఫరా అవుతున్న ప్రాంతాలకు మరింత వెసులుబాటు కలగనుంది. నూతన ఓహెచ్ఆర్‌లు ట్రైల్ రన్ కూడా వేయడం జరిగింది. ఈ ట్రైల్ రన్‌లో కొన్ని చోట్ల లీకులు ఉండడంతో వాటిని వెంటనే పరిష్కరించారు. వారం రోజుల్లో వీటిని ప్రారంభించే దిశగా అధికారులు కసరత్తులు చేస్తున్నారు.

పట్టణ చరిత్రలోనే రెండు పూటలా తాగునీరు

గతంలో పట్టణ జనాభా సుమారు 30 వేలు వరకు ఉండేది. కానీ ప్రస్తుతం జనాభా సుమారు లక్షకు చేరుకుంది. కాని ఇప్పటివరకూ కూడా పాత ఎక్విప్‌మెంట్ నుంచే నీటిని సప్లై చేస్తూ వస్తున్నారు. దీనివల్ల ప్రతీ రోజు ఉదయం ఒకగంట, సాయంత్రం ఒక గంట నీటిని సప్లై చేసేవారు. వేసవికాలం వచ్చిందంటే ఒక్కపూట మాత్రమే నీటిని సప్లై చేసేవారు. అది కూడా ఉదయం ఒక అరగంట విద్యుత్ సరఫరా నిలుపుదల చేయిస్తుండడంతో పట్టణంలో కొంత వరకూ నీటి సమస్య లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత సంవత్సరం నుండి వేసవిలో కూడా తాగునీరు రెండు పూటలా ఇచ్చేలా మునిసిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవడం గమనార్హం.. పాలకొల్లు చరిత్రలోనే వేసవిలో రెండు పూటలా తాగునీరు సప్లై చేయడం ఈ రెండు సంవత్సరాలు నుంచే జరగడం విశేషం.

రోజుకు రెండు కోట్ల లీటర్ల నీటి సరఫరా

పట్టణంలో కుళాయి కనెక్షన్లు సుమారు 10,500లు, ఎస్.ఎస్ ట్యాంకుల సామర్థ్యానికి అనుగుణంగా తాగునీటి పైపులైన్ల విస్తరణ తర్వాత సుమారు 92 కి.మీ, రోజుకు 90 లక్షల లీటర్లు సప్లై చేస్తున్నారు. ప్రస్తుతం నూతనంగా ప్రారంభోత్సవం కానున్న రెండు ఓహెచ్ఆర్‌ల్లో ఒక్కో ట్యాంకు నుండి పది లక్షల లీటర్లు విడుదల అవుతుంది. అలాగే ఫిల్టర్ ప్లాంట్‌ను ప్రారంభించనున్నారు. నూతన ఫిల్టర్ ప్లాంట్ 1.10 కోట్ల లీటర్లు సామర్థ్యం, ప్రస్తుతం ఉన్న పాత ఫిల్టర్ ప్లాంట్ నుండి 90 లక్షల లీటర్లు సామర్థ్యం. మొత్తం కలిపితే రోజుకు రెండు కోట్ల లీటర్లు సరఫరా జరుగుతుంది. దీంతో పట్టణ ప్రజల తాగునీటి సమస్య అతిత్వరలో తీరనుంది.

వారం రోజుల్లో ప్రారంభం



నూతన ఓహెచ్ఆర్ ట్యాంకులు ట్రయల్ రన్ పూర్తయ్యింది. మరోసారి ట్రయల్ రన్ వేసి వారం రోజుల్లో నూతన ట్యాంకులు, నూతన ఫిల్టర్ బెడ్‌లు ప్రారంభిస్తాం. నూతన ఫిల్టర్ ప్లాంట్ మరియు పాత ప్లాంట్ నుంచి రోజుకు రెండు కోట్ల లీటర్లు విడుదల అయ్యే సామర్థ్యం ఉంది. దీనివల్ల పట్టణంలో శివారు ప్రాంతాలకు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది.

– విజయ్, పబ్లిక్ హెల్త్ డీఈ, భీమవరం

క్లుప్తంగా

వాసవీమాత సేవలో ఎమ్మెల్సీ వంక


పెనుగొండలో ఎమ్మెల్సీ రవీంద్రకు వేద ఆశీర్వచనం చేస్తున్న వేద పండితులు

పెనుగొండ: ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ శనివారం పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషా సుమర్ధినీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పౌర్ణమి సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న చండీహోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రవీంద్రనాథ్‌కు వేద ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట్ల రామకృష్ణ మోహనరావు, తాతోలు వీరాచారి, ఆలయ కార్యనిర్వహణాధికారి జీఎస్ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాపులకొడప వెంకన్నకు ప్రత్యేక పూజలు



నరసాపురం రూరల్: మండలంలోని మేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. కోరిన కోర్కెలు తీర్చే కోనేటి రాయలవాడిగా ప్రసిద్ధి కెక్కడంతో సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్ కుమార్ ఆచార్యులు ప్రత్యేకంగా స్వామి వారిని అలంకరించి పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముత్యాలపల్లిలో ఫ్యామిలీ ఫిజిషియన్


ముత్యాలపల్లిలో రోగి ఇంటికి వెళ్లి పరీక్షిస్తున్న డాక్టర్ లీనా సుప్రియ

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలోని సచివాలయంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న డాక్టర్ లీనా సుప్రియ సుమారు 60 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం అదే గ్రామంలో దీర్ఘకాలంగా రోగంతో బాధపడుతూ లేవలేని పరిస్థితిలో ఉన్న వారి ఇంటికి వెళ్లి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, పి.రామకృష్ణ, బంగారమ్మ, మధుసూదనరావు, సీహెచ్ తులసమ్మ, ముత్యాలమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ పునర్నిర్మాణానికి శ్రీకారం


రామాలయ పునర్నిర్మాణానికి పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: కొడమంచిలి జక్కంశెట్టి వారి పాలెంలో రామాలయం పునః నిర్మాణానికి శనివారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, ఎంపీటీసీ సభ్యుడు చిలుకూరి నరేంద్ర, యల్లమెల్లి రాజేష్, సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, దేవస్థానం ఛైర్మన్ బాలనాగు నరేష్, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, ఏఎంసీ డైరక్టరు జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సాక సురేష్, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, వైఎస్సార్ సీపీ సేవాదల్ మండల అధ్యక్షుడు ఇంజేటి సుగుణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శ్రీనివాస్


ఎంపీడీఓ శ్రీనివాస్ దొర

పెనుగొండ: పెనుగొండ ఎంపీడీఓగా ఎస్ శ్రీనివాస్ దొర బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ బాధ్యతలు నిర్వహిస్తున్న డీబీఆర్ కృష్ణంరాజు తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లికి బదిలీ కావడంతో, పెనుగొండకు గోకవరం ఎంపీడీఓ కార్యాలయంలో ఏవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్ శ్రీనివాస్ దొర పదోన్నతిపై పెనుగొండకు ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ పుతిరెడ్డి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు అండ


బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందిస్తున్న దృశ్యం

నరసాపురం: అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా ఉంటుందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని 3వవార్డు కౌన్సిలర్ బొంతు రాజశేఖర్ బంధువుకు ఇటీవల ఆరోగ్యశ్రీ పథకంలోలేని జబ్బుకు వైద్యం చేయించారు. దీంతో అతని వైద్య ఖర్చులకు మంజూరైన రూ.5 లక్షలు చెక్కును శనివారం ముదునూరి తన కార్యాలయంలో బొంతు రాజశేఖర్‌కు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పేదల వైద్యం విషయంలో దృష్టి పెట్టి పనిచేస్తుందని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేసి రెండు వేల రకాల బబ్బులకు వైద్యం అందిస్తుందని చెప్పారు. రూ.1000 ఖర్చు దాటిన వైద్యానికి ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేశారన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో లేకుండా అరుదుగా వచ్చే జబ్బులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాబ్జి, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల, మొగల్తూరు మండలాల అధ్యక్షులు బూసరపు జయ, దొంగ మురళీకృష్ణ, కర్రి ఏసుబాబు, రేవు రాంబాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు


వేసవి విజ్ఞాన తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

నరసాపురం: నరసాపురం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. 27వ రోజు శనివారం విద్యార్థులకు డ్రాయింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ప్రతీరోజూ దినపత్రికలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. యోగాలో శిక్షణ ఇచ్చారు. సెవెన్ ఆలివ్స్ ఫౌండేషన్ చైర్మన్ గుంపుల రీటా, లైయన్స్‌క్లబ్ కార్యదర్శి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలవైపు ఎలా అడుగులు వేయాలనే అంశంపై మాట్లాడారు. లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఆచంటలో అభివృద్ధి పరవళ్లు


ఆచంటలో కాపుల కల్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తున్న మోషేన్ రాజు, శ్రీరంగనాథరాజు, రవీంద్రనాథ్

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో అభివృద్ధి పరవళ్లు తొక్కుతున్నాయని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. శనివారం పెదపేటలో రూ.2 కోట్లతో నిర్మించబోయే ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు తొలి విడతలో రూ.20 లక్షలతో నిర్మాణానికి, రూ.2 కోట్లతో నిర్మించబోయే కాపుల పాలెంలోని కాపుల కల్యాణ మండపానికి తొలివిడతలో రూ.20 లక్షలు మంజురు కావడంతో నిర్మాణానికి, అదేవిధంగా రూ.13 లక్షల వ్యయంతో నిర్మాణం ప్రారంభించిన కాపు శెట్టి బలిజ కమ్యూనిటీ హాల్‌కు, రూ.12 లక్షలతో నిర్మించే ఎస్సీ మాదిగ కమ్యూనిటీ హాల్‌కు, రూ.10 లక్షలతో దేవాంగుల కమ్యూనిటీ హాల్‌కు, రూ.10 లక్షలతో నాయీబ్రాహ్మణ కమ్యూనటీ హాల్‌కు, రూ.10 లక్షలతో ఉప్పరి కమ్యూనిటీ హాల్‌కు, రూ.10 లక్షలతో విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌కు, రూ.5 లక్షలతో వెన్నపువారిపాలెంలో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపనలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా సొంత ఖర్చులతో ప్రజలకు అండగా నిలిచే నాయకుడు శ్రీరంగనాథరాజు అని కొనియాడారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ అన్ని వర్గాలకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. 15 ఏళ్లుగా ఆచంట అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. ప్రతీ వర్గానికి అండగా నిలిచి అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. శాసన మండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో 100 కమ్యూనిటి భవనాలకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శెట్టి బలిజ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య, ఆచంట ఏఎంసీ ఛైర్మన్ చిల్లే లావణ్య, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరక్టరు మామిడి శెట్టి కృష్ణవేణి, ఆచంట సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ అడ్డాల పెద్దిరాజు, ఆయా సంఘాల నాయకులు మట్టా ఆనందకుమార్, కప్పల రాజేంద్ర ప్రసాద్, తప్పెట్ల వెంకట్రావు, చదలవాడ మరియమ్మ, చదలవాడ రామారావు, చల్ల శ్రీను, నిమ్మల సత్యనారాయణ, పెచ్చెట్టి శ్రీను, మన్నే మావుళ్లు, మన్నే నాగరాజు, ద్వారా పెద్దిరాజు, బుడిది సింహాచలం, అలజంగి శ్రీను, మెండే శ్రీను, వేమన అప్పారావు పాల్గొన్నారు.

నెగ్గిపూడి కాలనీ సమస్యలకు పరిష్కారం


తూర్పుపాలెంలో కాలనీ మహిళలతో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: నెగ్గిపూడి లోని కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం తూర్పుపాలెంలో నెగ్గిపూడి కాలనీ మహిళలు మాజీమంత్రి శ్రీరంగనాథరాజును కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. విద్యుత్ సమస్యలు సత్వరం పరిష్కరించాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. త్వరలోనే స్వయంగా కాలనీలో సమస్యలుపరిశీలించి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని భరోసా ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ పాలనలో అభివృద్ధి పథంలో గ్రామాలు


పెనుమదంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జెడ్పీచైర్మన్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పోడూరు: వైఎస్సార్ సీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని జెడ్పీచైర్మన్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పెనుమదం గ్రామంలో జెడ్పీనిధులు, గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మిస్తున్న సీసీ రహదారులు, సీసీ డ్రెయిన్లు, గ్రామ సచివాలయ భవన నిర్మాణం పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఆయా పనులను త్వరితగతిన, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్ వెంట సొసైటీ ఛైర్మన్ కొప్రపాటి వీరాస్వామి, ఉప సర్పంచ్ పితాని చిన్న, పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు గెద్దాడ ఏసు తదితరులు ఉన్నారు.

ఆసుపత్రి ఆధునికీకరణ పనుల పరిశీలన


పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వాసుపత్రి భవనాల ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కి ఆదేశాలిచ్చారు. రూ.12.50 కోట్లతో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో నిర్మిస్తున్న నూతన భవనాల పనులను శనివారం ఎమ్మెల్సీ శ్రీనివాస్ పరిశీలించారు. భవనాల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. 100 పడకల ఆసుపత్రి పూర్తి చేయడం ద్వారా పశ్చిమ గోదావరి జిల్లాలోని సుమారు 10 మండలాల ప్రజలతో పాటు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు, మలికిపురం మండలాల ప్రజలకు ఈ ఆసుపత్రి ద్వారా సేవలు పొందుతారన్నారు. ఆయన వెంట చింతలపూడి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, ఆసుపత్రి అడ్వయిజరీ కమిటీ సభ్యులు చినిమిల్లి గణపతిరావు, చెన్ను విజయ్, పార్టీ నాయకులు కోరాడ శ్రీనివాసరావు, ఖండవల్లి వాసు, పెచ్చెట్టి కృష్ణాజీ, జమ్ము కాశీ, బాకూరి సత్యనిరంజన్, నీలంశెట్టి సత్యప్రసాద్, బండి రమేష్, కెల్లా దుర్గారావు, కెల్లా పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ధర లేక మామిడి రైతుల దిగాలు


ఎల్బీచర్ల సెంటర్లో మామిడిపళ్ల అమ్మకాలు సాగిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఈ ప్రాంత బంగినపల్లి మామిడికి ఈ ఏడాది గడ్డుకాలంగా ఉందని రైతులు వాపోతున్నారు. నరసాపురం, మొగల్తూరు ప్రాంతాల్లో ఏటా మామిడిపండ్ల దిగుబడి సీజన్ ఆఖరులో ప్రారంభమవుతుంది. ఈ ఏడాది పంట చేతికి వచ్చే తరుణంలో వాతావరణంలో మార్పులు రావడంతో ఇటీవల వీచిన ఈదురు గాలులకు కాయలు నేలరాలాయి. ఈ ఏడాది పూత దశ నుంచే మామిడి రైతుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పూత దశలో ఎక్కువగా మంచుకురవడం, అనంతరం అకాల వర్షాలతో పిందె దశలోనే తెగుళ్ల తాకిడి ఎక్కువైంది. దీనికి తోడు ఎండలు ఎక్కువగా ఉండటం వాతావరణంలో మార్పుల కారణంగా మామిడికాయ సైజు తక్కువగా ఉండటం, తెగుళ్ల సోకడం తదితర కారణాలతో రైతులకు పెట్టుబడులు దక్కడం గగనమైంది. కొన్ని ప్రాంతాల్లోని రైతులకు పెట్టుబడి, లీజు డబ్బులుకూడా రాకుండా పోయాయని వాపోతున్నారు. ఎల్బీచర్ల, సీతారాంపురం ప్రధాన రోడ్లపై వరుసగా మామిడి పళ్ల దుకాణాలు వేసి రైతులే అమ్మకాలు సాగిస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పండించిన పంట దిగుబడి వచ్చిన తరువాత ఒక్కోపండు అమ్ముకుని డబ్బు రాబట్టుకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మామిడి పండు కాపు తక్కువగా ఉండడం తదితర కారణాలతో పాటు మార్కెట్లో ధరకూడా అనుకూలంగా లేకపోవడం వెరసి రైతులు నష్టాల బాటపట్టినట్లు పేర్కొంటున్నారు.

ఇళ్ల నిర్మాణం ప్రారంభించకపోతే పట్టాలు రద్దు


కొంతేరు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ ప్రగతిపై ఆరా తీస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

యలమంచిలి: అన్ని వసతులు ఉన్న జగనన్న కాలనీల్లో నూరు శాతం ఇళ్ల నిర్మాణం ప్రారంభించకపోతే లబ్ధిదారుల పట్టాలను వెంటనే రద్దు చేయమని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కొంతేరు గ్రామంలోని జగనన్న కాలనీని, నాడు–నేడు పనులు జరుగుతున్న, జరిగిన ప్రాథమిక పాఠశాలలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె పరిశీలించారు. జగనన్న కాలనీలో రోడ్లు, విద్యుత్, తాగునీరు సౌకర్యం పూర్తయినా ఇళ్ల నిర్మాణం ప్రారంభించకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఈ నెలలో నూరు శాతం ఇళ్ల నిర్మాణం ప్రారంభించకపోతే వారి పట్టాలను రద్దు చేసి ఇళ్ల స్థలాల కోసం అర్జీలు పెట్టుకున్న వారితో వెంటనే ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని హామీ తీసుకుని వారికి కొత్త పట్టాలు మంజూరు చేయమని ఆమె ఆదేశించారు. ఈ లేఅవుట్‌లో ఓఎన్‌జీసీ పైపులైన్ ఉండడం, ఆ స్థలంలో ఏడుగురికి పట్టాలు వచ్చాయని, అయితే ఓఎన్‌జీసీ అధికారుల అభ్యంతరం వల్ల వారు ఇళ్ల నిర్మాణ ం ఆగిపోయిందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఈ లేఅవుట్‌లో ఇంకా ఖాళీ స్థలాలు ఉన్నాయా అని అడిగారు. ఉన్నాయని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం సునీల్ చెప్పగా ఓఎన్‌జీసీ పైపులైన్ ఉన్న స్థలాన్ని రిజర్వ్ సైట్‌గా చూపించి, ఏడుగురికి ఖాళీ స్థలాలను కేటాయిస్తూ తనకు ఫైల్ పంపమని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని వివిధ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను ఆమె పరిశీలించారు. పాఠశాలలు తెరిచే నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట గృహనిర్మాణ శాఖ డీఈ రామాయణం త్రిమూర్తులు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం సునీల్, ఈఓపీఆర్డీ వైభావతి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం మళ్ల సోని, గ్రామ కార్యదర్శి కూనా వెంకట రామాంజనేయులు వీఆర్వో గెద్దం చిన సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఎండ వేడిమితో ప్రజల బెంబేలు


సాయంత్రం సమయంలో సైతం నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి


పెనుమంట్రలో వెలవెలబోతున్న శనివారం వారపు సంత

నరసాపురం రూరల్: వాతావరణంలో మార్పులతో గత నాలుగు రోజులుగా ఒకటే ఉక్కబోత, విపరీతమైన ఎండలతో జనం అల్లాడి పోతున్నారు. రోహిణి కార్తీ ఎండలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వాతావరణంలోని మార్పులతో భానుడి ప్రతాపం రోజు రోజుకు పెరుగుతుంది. శనివారం పగటిపూట ఎండ విపరీతంగా ఉండటంతో సాయంత్రం వేళల్లో భరించలేని ఉక్కబోతతో ప్రజలు ఆందోళన చెందారు. గాలిలో విపరీతంగా తేమ శాతం పెరగడంతో శరీరమంతా జిడ్డుగా తయారవడంతో ఉక్కపోత తట్టుకోలేకపోతున్నారు. గ్రీష్మతాపం విపరీతంగా పెరిగింది. దీనికి తోడు ఎండ వేడిమి తట్టుకోలేని పరిస్థితి ఎదురైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీచిన వేడి గాలులతో ప్రజలు అల్లాడిపోయారు. రహదారులు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించాయి. సాయంత్రం 6 దాటినా వేడి గాలులు వీయడంతో వృద్ధులు, పిల్లలు ఎండ వేడిమిని తట్టుకోలేక అల్లాడిపోయారు. రోహిణి కార్తెలో రోళ్లు పగులు తాయని నానుడి. అయితే నిజంగానే అగ్గి రాజేసినట్లుగా గత కొన్ని రోజులుగా ఉంటున్న ఈ ఎండలను చూస్తుంటే ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. మధ్యాహ్నం నుంచే మార్కెట్ కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్నాయి.

మండుటెండలతో వెలవెలబోయిన వారపు సంత

పెనుమంట్ర: మండల కేంద్రమైన పెనుమంట్రలో శనివారం జరిగే వారపు సంత మండుటెండలతో వెలవెలబోయింది. ప్రతీ శనివారం ట్రాఫిక్ సైతం నిలిచిపోయే ఈ వారపు సంతలో మధ్యాహ్నం 3 గంటలు దాటినా దుకాణాలు సరిగా వేయక పోవడంతో సంతలో కొనుగోలుదారులు ఎవరూ రాక సంత వెలవెలబోయింది. మండుటెండల్లో దుకాణాలు వేయడం వ్యాపారులకు కూడా ఇబ్బందిగా మారడమే గాకుండా కొనుగోలుదారులు కూడా మండుటెండలో దుకణాలకు రాలేని పరిస్థితులు సంతంతా ఖాళీగా కనిపించింది. దీంతో వేసిన దుకాణదారులకు వ్యాపారాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అమృత్ సరోవర్ పనుల పరిశీలన

పెనుగొండ: కొడమంచిలి చినపేటలో అమృత్ సరోవర్ పథకంలో నిర్వహిస్తున్న మంచినీటి చెరువు ఆధునికీకరణ పనులను జిల్లా తనిఖీ బృందం శనివారం పరిశీలించింది. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బృంద ఇన్‌చార్జి పోడూరు అగ్రికల్చర్ ఏడీఏ పార్వతి, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, టీఏ మణికంఠ, ఎఫ్ఏ కోట శశి మధు, పోచి, ఎంపీటీసీ సభ్యుడు చిలుకూరి నరేంద్ర, వుచ్చకాయల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో విశాఖ విహారయాత్ర

నరసాపురం: నరసాపురం డిపో నుంచి ప్రతి శనివారం ఏర్పాటు చేసిన విశాఖ యాత్ర సూపర్ లగ్జరీ బస్సు శనివారం రాత్రి 7 గంటలకు బస్టాండ్ నుంచి బయలుదేరి వెళ్లింది. డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ టి.ధనలక్ష్మి బస్సును ప్రారంభించారు. ఈ బస్సు ప్రతి శనివారం బస్టాండ్ నుంచి బయలుదేరి తిరిగి సోమవారం నరసాపురం చేరుకుంటుంది. యాత్రలో భాగంగా సింహాచలం, కైలాసగిరి, ఉడా పార్కు, నేవీ మ్యూజియం, సబ్‌మెరైన్, ఆర్కే బీచ్, కాళీ టెంపుల్‌ను ప్రయాణికులు సందర్శించవచ్చు. అంతేకాకుండా 30 మంది ప్రయాణికులు ఉంటే అరుణాచలం, 35 మంది ప్రయాణికులు ఉంటే మ్యారేజ్ ట్రిప్‌లు తిప్పుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.